క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు యూటీఎఫ్ సాయం

కుక్కునూరు:వేలేరుపాడు మండలం కన్నాయి గుట్ట అగ్నిప్రమాద బాధితులకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన యునైటెడ్ టీచర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసరాలను అందించినట్టు కుక్కునూరు మండల బాధ్యులు గుండి సత్యనారాయణ చెప్పారు.బాధితులకు 9 క్వింటాళ్ల బియ్యం, ప్లేట్లు, గ్లాసులు, ఇతర నిత్యావసరాలను అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో బ్యారన్ దగ్ధం

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో రైతు మహేష్‌కు చెందిన పొగాకు బ్యారన్ శుక్రవారం అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. పొగాకు బ్యారన్ క్యూరింగ్ జరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగి ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఆలయ అభివృద్ధికి వితరణ


జంగారెడ్డిగూడెం విజయదుర్గ ఆలయానికి విరాళం అందజేస్తున్న కర్పూరం హరికృష్ణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం విజయదుర్గ అమ్మవారి ఆలయ అభివృద్ధికి జంగారెడ్డిగూడెంకు చెందిన కర్పూరం హరికృష్ణ, మణి దంపతులు రూ. 10,116 విరాళం అందించినట్లు కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం ఉదయం అమ్మవారి ఆలయంలో దాతలకు కమిటీ సభ్యులు, అర్చకులు శేషవస్త్రం అందజేశారు. కమిటీ కార్యదర్శి మాడా రామమోహనరావు, ఉపాధ్యక్షుడు కందులపాటి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై 5న చలో ఢిల్లీ

ద్వారకాతిరుమల: రైతాంగ సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు పిలుపునిచ్చారు. మండలంలోని ఎం.నాగులపల్లిలో కూరగాయల రైతుల భవనంలో సంఘ మండల అధ్యక్షుడు బోయపాటి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సుల్లో భాస్కరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల ఫలితంగా కార్మికులు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, నందమూరి త్రినాథ్, తూంపాటి మురళి, గుర్రం రాంబాబు, పోలుకొండ నాగరాజు, ఎలమర్తి రాంబాబు తదితరులున్నారు.

వేదాంతపురంలో శిలువ మార్గం


వేదాంతపురంలో శిలువ మార్గం నిర్వహిస్తున్న విశ్వాసులు

కొయ్యలగూడెం: వేదాంతపురంలో శుక్రవారం విశ్వాసులు శిలువ మార్గం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పర్వదినోత్సవాలను పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన విశ్వాసులు భారీ సంఖ్యలో శిలువ మార్గంలో పాల్గొన్నారు. ఆర్‌సీఎం చర్చి పాస్టర్స్ ఫ్రాన్సిస్, సమీర్ శౌరి మాట్లాడుతూ నాలుగు వందలు మందికి పైగా విశ్వాసులు శిలువ మోస్తూ ర్యాలీలో పాల్గొన్నారని తెలిపారు. స్థానిక సంఘ కాపరి, ముప్పిడి సురేష్, ఉపదేశకులు ఏసురత్నం, రవికుమార్ జోసప్ తంబి, రాంబాబు,సింగ్ మాత్యు, సంఘ పెద్దలు యేసు, సంఘ యుత్ సభ్యులు పాల్గొన్నారు.

యండపల్లి పంచాయతీ అభివృద్ధికి కృషి


యండపల్లి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ రాంబాబు నాయక్

చింతలపూడి: యండపల్లి పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని ఎంపీపీ బి రాంబాబు నాయక్ హామీ ఇచ్చా రు. మండలంలోని యండపల్లి పంచాయతీలో శుక్రవారం ఆయన పర్యటించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మండల నిధులతో శ్మశాన వాటిక సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. సర్పంచ్ యడ్ల మోహన్‌రావు,వైస్ ఎంపీపీ గుత్తా కిషోర్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర ప్రారంభం



జంగారెడ్డిగూడెంలో మహిళల శోభాయాత్ర, శృంగవృక్షం నూకాలమ్మ ఆలయానికి కాలినడకన వెళుతున్న శ్రీదత్తపీఠం పీఠాధిపతి శ్రీసాయి దత్త నాగానంద సరస్వతి స్వామి తదితరులు

- గంగానమ్మ అమ్మవారికి సంప్రదాయ సారె సమర్పణ
- 1008 ముత్తైదువులతో శోభాయాత్ర
- శోభాయాత్ర ప్రారంభించిన సాయి దత్త నాగానంద సరస్వతీ స్వామి

జంగారెడ్డిగూడెం: ప్రకృతి శక్తి స్వరూపమని, సకల జీవరాశి మనుగడకు ప్రకృతే మూలాధారమని, పంచభూతాలు రూపంలో జీవశక్తిని అందిస్తున్న అదిశక్తి అయిన అమ్మవారికి కృతజ్ఞత అందజేసే ప్రక్రియే జాతర సంప్రదాయ అంతరార్థం అని పాలకోడేరు మండలం శృంగవృక్షం శ్రీదత్తపీఠం పీఠాధిపతి సాయి దత్త నాగానంద సరస్వతి స్వామి అన్నారు. జంగారెడ్డిగూడెం నూకాలమ్మవారి 59వ ఉగాది జాతర మహోత్సవాలు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు), కమిటీ నిర్వహణలో వైభవంగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు ఈ జాతర మహోత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు గంగానమ్మవారు 1008 మంది ముత్తైదువులతో సప్త నదీజలాల సహస్ర కలశాలతో, పట్టు వస్త్రాలు, మంగళ ద్రవ్యాలు, పాలపొంగళ్లు (బోనాలు), మంగళ వాయిద్యాలు, గరగాటలు, పాన్పులు, వేదమంత్రాల నడుమ శోభయాత్రగా నూకాలమ్మ సన్నిధికి సంప్రదాయ సారెను అందజేసే కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

శోభయాత్రను ప్రారంభించేందుకు గంగానమ్మ ఆలయానికి చేరుకున్న దత్తపీఠం పీఠాధిపతి సాయి దత్త నాగానంద సరస్వతి స్వామిని రెండు ఆలయాల కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన గంగానమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక రథంపై గంగానమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి శోభాయాత్రను ప్రారంభించారు. రెండున్నర కిలోమీటర్ల మేర నిర్వహించిన ఈ శోభాయాత్రలో మహిళలు పాల్గొన్నారు. స్వామీజీ పాదయాత్రగా నూకాలమ్మ దివ్య సన్నిధిని చేరుకుని అమ్మవారిని దర్శించారు.


విశేష అలంకరణలో నూకాలమ్మవారు

ప్రధానార్చకుడు యరమిల్లి మనోజ్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేసి గంగానమ్మ ద్వారా వచ్చిన సంప్రదాయ సారెను నూకాలమ్మకు సమర్పించారు. ఈ సందర్భంగా నాగానంద సరస్వతి స్వామి నూకాలమ్మ, గంగానమ్మవార్లకు విశేష అభిషేకం నిర్వహించి, హారతులిచ్చారు. సాయంత్రం నూకాలమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. నూకాలమ్మ వైభవంపై సాయి దత్త నాగానంద సరస్వతీ స్వామి అనుగ్రహ భాషణం అందజేశారు. స్వామీజీకి ఆలయ మర్యాదలతో శేష వస్త్రాలు అందించి ఆలయ కమిటీ సత్కరించింది. అమ్మవారిని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, చిన్న దంపతులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో బంగారు సూర్యనారాయణ, శివలక్ష్మి దంపతులు, గొట్టుముక్కల వంశీకుమార్‌రాజు, స్వాతిమణి పోలుపర్తి రాము, సత్యవతీ, కాకర్ల రామచంద్రబాబు, మాధవి, చిన్ని రామ సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు, ఈమని శశికుమార్, తిప్పాబట్ల రామకృష్ణ, బవిరిశెట్టి మురళి పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

వేలేరుపాడు: మండలంలోని కన్నాయిగుట్ట, టేకూరులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం మంచినీటి డ్రమ్ములు, ఐరన్ మంచాలు పంపిణీ చేశారు. కన్నాయిగుట్టలో 27 గిరిజన కుటుంబాలకు, టేకూరులో మూడు కుటుంబాలకు 200 వందల లీటర్ల మంచి నీళ్ల పట్టే డ్రమ్ములు అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.3 వేల విలువ చేసే వస్తువులు అందజేశారు. తిర్లాపురం సర్పంచ్ సోడె విజయ, జిల్లా కార్యదర్శి టి, సుధాకర్, ధర్ముల సురేష్, వెట్టి సుబ్బన్న, కె వి రమణ, ఎస్ రామ్మోహన్‌రావు, వెట్టి భారతి, రామలక్ష్మి, కిరణ్, ప్రజా పంథా నాయకులు ఎస్‌కె గౌస్,కట్టం ముత్యాల్‌రావు, గడ్డాల ముత్యాల్‌రావు, కట్టం వీరాస్వామి, పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందండి

చింతలపూడి: చింతలపూడి నగర పంచాయతీలో పన్ను బకాయిదారులు ఈ నెల 31లోగా పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చింతలపూడి కమిషనర్ ఎస్ఆర్ బాబు శుక్రవారం పేర్కొన్నారు. కోవిడ్ ప్రభావం, ఆస్తి పన్ను సవరణలో అధిక మొత్తంలో పన్ను బకాయిలు పేరుకుపోయినందున మున్సిపల్ పరిపాలక శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ సూచనలు మేరకు బకాయిలు చెల్లింపుపై వడ్డీ రాయితీని ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కావున చింతలపూడి నగరపంచాయతీలో ఆస్తి, ఖాళీ స్థలం పన్నులు బకాయిలు ఉన్న వారు ఈ నెల 31లోగా ఒకేసారి చెల్లించి వాటిపై విధించిన వడ్డీ మాఫీ పొందాలని సూచించారు.

ఎమ్మెల్సీలకు అభినందనలు

కొయ్యలగూడెం: ఎమ్మెల్సీలుగా విజయం సాధించిన వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్‌ను కొయ్యలగూడెం మండల వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు ఏలేటి చిన్న తుక్కయ్యల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు తణుకు వెళ్లి రవీంద్రనాథ్ నివాసంలో ఇరువురి ఎమ్మెల్సీలను కలుసుకున్నట్లు తెలిపారు. అంకిత భావంతో పనిచేసిన ప్రజాప్రతినిధులకు ఇరువురు నేతలు కృతజ్ఞతలు తెలిపారని అన్నారు. త్వరలోనే పోలవరం నియోజకవర్గంలో వారిద్దరూ కలిసి పర్యటిస్తారని తెలిపారు.


ఎమ్మెల్సీలుగా విజయం సాధించిన రవీంద్రనాథ్, శ్రీనివాసును అభినందిస్తున్న నాయకులు

ఎమ్మెల్సీ శ్రీనివాస్‌ను కలిసిన పోలవరం నాయకులు

పోలవరం రూరల్: ఉమ్మడి పశ్చిగోదావరి జిల్లా స్థానిక సంస్థల కోటా నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలుపొందిన కవురు శ్రీనివాస్‌ను పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీతో విజయం సాధించి మళ్లీ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గెలవడం ఖాయమని వారన్నారు.


కవురు శ్రీనివాస్‌కు అభినందనలు తెలుపుతున్న సుంకర వెంకటరెడ్డి తదితరులు

గ్రామ సమస్యలు తెలుసుకునేందుకే రాత్రి సభలు

చింతలపూడి: గ్రామంలో సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణజ్యోతి తెలిపారు. మండలంలోని సీతానగరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం సర్పంచ్ గాయం మల్లేశ్వరి అధక్షతన రాత్రి సభ ఏర్పాటు చేశారు. సభలో తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసమే ప్రభుత్వం రాత్రి సభలు నిర్వహించమని ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. సభలో గ్రామస్తులు పెన్షన్లు, అంతర్గత రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. గ్రామంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, సబ్ కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఉప సర్పంచ్ గుమ్మళ్ళ గోపి ప్రసాద్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ ప్రసాద్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మవారికి వెండి సమర్పణ

జంగారెడ్డిగూడెం: కొత్త మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కొలువై ఉన్న శ్రీ చక్ర సహిత ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం గంటావారిగూడెంకు చెందిన మద్దాల రాంబాబు, శ్రీదేవి దంపతులు కేజీ వెండి అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో సత్కరించి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని కమిటీ సభ్యులు అందజేశారు. ఈ నెల 19 నుంచి 22 వరకు తృతీయ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు నొడు శివ దంపతులు, ఎర్ర సత్యలక్ష్మి, చోడవరపు రంగ, జ్యోతి దంపతులు మహంకాళి రాయుడు దంపతులు, టిప్ టాప్ చంటి దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


దాత మద్దాల రాంబాబు, శ్రీదేవి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న కమిటీ సభ్యులు

వైభవంగా వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవం

భీమడోలు: గుండుగొలనులో శ్రీదేవి భూసమేత వేంకటేశ్వర స్వామి వారి వార్షిక మహోత్సవ వేడుక శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, దాతల ఆర్థిక సాయంతో ఆలయాన్ని పునర్నిర్మించి ఏడాది పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్లకు ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ, దేవాదాయ ధర్మశాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో మార్టేరుకు చెందిన శ్రీనివాసుల విజయగోపాలచార్యులు, పానింగిపల్లి మోహనకృష్ణామాచార్యులు, మంగపతి ఆచార్యులు, సుధీరాచార్యులతో పాటు 12 అర్చక బృందం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర వారిని విశేషంగా అలంకరించి ముస్తాబు చేసారు. స్వామి వార్లకు మహాభిషేక పూజలు, సుదర్శన హోమాలు నిర్వహించారు. కొత్త ఉత్సవ మూర్తులను ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి అచ్యుతరామారావు ఆలయానికి సమర్పించారు. అనంతరం శాంతి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసారు.

ఫ్యాన్లు, లైట్లు పాడుచేశారని..

జంగారెడ్డిగూడెం : పాఠశాలలో ఫ్యాన్లు, లైట్లు పాడు చేశారని ముగ్గురు విద్యార్థులను ఉపాధ్యాయులు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన ఘటన గురువారం జరగగా, శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు గురువారం పాఠశాల తరగతి గదిలో ఫ్యాన్ల రెక్కలను వంచేశారు. ట్యూబ్‌లైట్లను పగులగొట్టారు. దీనిని గమనించిన ఉపాధ్యాయులు వారిని నిలదీయగా, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పా రు. అనారోగ్యం కారణంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సెలవులో ఉండటంతో ఉపాధ్యాయులు విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. వారి చేష్టలను వివరించి కాస్త భయం చెప్పాలని కోరారు. సమాచారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా, వారినుంచి సంతకాలు తీసుకున్న పోలీసులు విద్యార్థులను ఇళ్లకు పంపించారు. ఈ ఘటనపై శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులను నిలదీశారు. తమ పిల్లలు తప్పు చేస్తే తమకు తెలియజేయాలని, నేరస్తుల్లా పోలీస్‌స్టేషన్‌కు అప్పగించడమేంటని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఎంఈవో రాముడు పాఠశాలకు చేరుకుని జరిగిన ఘటనపై విచారణ చేశారు. తల్లిదండ్రులతో మాట్లాడారు.


మాట్లాడుతున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ

ఉపాధ్యాయులను ఆరా తీయగా, పిల్లలకు జాగ్రత్తలు చెప్పించాలనే ఉద్దేశంతో పోలీస్‌స్టేషన్‌కి తీసుకువెళ్లినట్టు వెల్లడించారు. ఈ ఘటనపై డీఎస్పీ కేవీ సత్యనారాయణ శుక్రవారం సాయంత్రం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ ఘటనపై సోషల్‌మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమన్నారు. ఉపాధ్యాయులు తీసుకువచ్చిన ముగ్గురు విద్యార్థులకు తమ సిబ్బంది కేవలం అవగాహన కల్పించారని, ఎలా ఉండాలో తెలియజేస్తూ కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదూ ఇవ్వలేదని, కేసు నమోదు చేయలేదని ఆయన వివరించారు. విద్యార్థులు చదువుపై దృష్టిసారించి మంచి భవిష్యత్తును ఎంచుకోవాలని డీఎస్పీ సూచించారు. ఈ ఘటన జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ దృష్టికి వెళ్లడంతో ఆయన దీనిపై స్థానిక తహసీల్దారును విచారణకు ఆదేశించినట్టు తెలిసింది.

సమర్థ నీటి వినియోగంతో సత్ఫలితాలు

బుట్టాయగూడెం: వ్యవసాయ సాగుకు సమర్థ నీటి వినియోగంపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలని కేఆర్‌పురం ఐటీడీఏ వ్యవసాయ శాఖ ఏడీఏ ఏజీ బుచ్చిబాబు మండలంలోని కండ్రికగూడెంలో సమర్థ నీటి వినియోగంపై ఐటీసీ- ఎంఎస్‌కె బైఫ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అధునాతన పద్ధతుల ద్వారా పంటలకు నీటి వినియోగాన్ని తగ్గిస్తూ పంట దిగుబడి పెంచే విధంగా అవగాహన పెంచుకోవాలని అన్నారు. సంస్థ రాష్ట్ర ప్రతినిధి గోపాలరెడ్డి, ఎండీఓ కేఆర్‌ఎస్ ప్రసాద్, ఏఓ బి. సుమలత పాల్గొన్నారు.


కండ్రికగూడెం సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ

అకాల వర్షం... మిర్చికి నష్టం


తాట్కూరుగొమ్ములో వర్షానికి తడిసిన మిర్చి


రేపాకగొమ్ములో మిర్చిపై కప్పిన బరకాలు

వేలేరుపాడు: మండలంలో శుక్రవారం కురిసిన అకాల వర్షానికి మిర్చి రైతుకు నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఆరబెట్టి ఉన్న మిర్చి కొంతమేరకు తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బరకాలు (టార్పాలిన్లు) అందుబాటులో ఉన్న రైతులు మిర్చిపై కప్పారు. మండలం పరిధిలో ఈ ఏడాడి సుమారు మూడువేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగుచేశారు. ఈ ఏడాది క్వింటా మిర్చ ధర రూ.22వేలు పలుకుతుండటంతో రైతులు ఆనందపడ్డారు. ఈ సమయంలో అకాల వర్షం రైతుల పాలిట శాపమైంది. రెండో రోజు కూడా వర్షం కొనసాగితే మరింత నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. వర్షం వల్ల మొక్కలకు ఉన్న మిర్చికి ఫంగస్ సోకి నాణ్యత తగ్గుతుందని వారన్నారు. లేత దశలో ఉన్న పుల్లశనగ, కంది, మినుము పంటలకు వర్షం వల్ల నష్టం వాటిల్లింది.

భగత్ సింగ్ పోరాటం యువతకు స్ఫూర్తి

జంగారెడ్డిగూడెం: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం పిలుపునిచ్చారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం ఎస్సీ బాలుర కాలేజీ హాస్టల్లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి స్మారక వారోత్సవ సభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం కావాలని, సామ్రాజ్యవాదం నశించాలని చిన్న వయసులోనే వారు విప్లవ పోరాటాలు సాగించి అమరులయ్యారని పేర్కొన్నారు. మార్చి 23 నుంచి 29 వరకు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ స్మారక వారోత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్, కే.కౌశిక్, డి.ప్రేమ్‌చంద్, కె.మంగరాజు, సి.హెచ్. కార్తికేయ పాల్గొన్నారు.


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ విధానం


పడమటి గిరిబాబు

జంగారెడ్డిగూడెం: అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ విధానమని వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు పడమటి గిరిబాబు అన్నారు. జంగారెడ్డిగూడెంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. విద్యారంగం, వైద్య రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపి వాటిని ముందువరుసలో నిలిపేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. అన్ని వర్గాలను ఆదుకునే విధంగా బడ్జెట్ ఉందని గిరిబాబు పేర్కొన్నారు. వ్యవసాయం, పరిశ్రమ, విద్య, ఉపాధి ఇలా అన్ని రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయాలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అని గిరిబాబు అన్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన ఇద్దరూ ఎమ్మెల్సీలైన శ్రీనివాస్, రవీంద్రలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


ఎల్ఎన్‌డీపేటలో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

పోలవరం రూరల్: స్వచ్ఛభారత్ కార్యక్రమానికి చెందిన కేంద్ర బృందం ఏలూరు జిల్లా పోలవరం మండలంలోని ఎన్ఎన్ డీపేట ఇటికిలకోట గ్రామాల్లో శుక్రవారం పర్యటించింది. టీమ్ కోఆర్డినేటర్ బాల గంగాధర్ నేతృత్వంలో సిబ్బంది గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమం అమలుపై పరిశీలన చేశారు. గృహాల్లో మరుగుదొడ్లు ఉన్నాయా లేదా అనేది తెలుసుకున్నారు. బహిరంగ మల విసర్జనను అరికట్టేందుకు తీసుకున్న చర్యలు, ఇళ్లల్లోని మరుగుదొడ్లు వాడుతున్నారా అనే విషయాలను పంచాయతీ సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు, డ్రైనేజీలను పరిశీలించారు. గ్రామాల్లో అమలు చేస్తున్న పారిశుధ్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, డీపీఆర్‌సీ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ నిఖిల్, పంచాయతీ కార్యదర్శులు రాజారావు, అప్పారావు, కొండలరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లికి చెందిన కంచర్ల హర్షవర్ధన్ జంగారెడ్డిగూడెం వైపు వస్తుండగా, మానుకొండ మనోజ్‌కుమార్ అశ్వారావుపేట వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్నారు. స్థానిక భాష్యం స్కూల్ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మనోజ్‌కుమార్‌కు స్వల్ప గాయాలు కాగా, హర్షవర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అదే దారిలో కారులో వెళుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైసీపీ నాయకుడు బత్తిన చిన్న తమ కారులో క్షతగాత్రులను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి క్షతగాత్రుల కుటుంబ సభ్యులు వచ్చి ఇద్దరినీ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మనోజ్ కుమార్ చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి వెళ్లిపోగా, హర్షవర్ధన్ చికిత్స పొందుతున్నాడు.